క్లుప్తంగా

ఎమర్జెన్సీపై అవగాహన


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వెంకటాచలం : బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో వెంకటాచలంలోని రావూస్ కళాశాలలో ఎమర్జెన్సీపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడారు. అధికారాన్ని నిలుపుకోవడానికి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిందని, దీనివల్ల దాదాపు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించి 4000 మంది నాయకులను అరెస్ట్ చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు అశోక్ నాయుడు, యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేష్ పాల్గొన్నారు.

117 జీఓను రద్దు చేయాలి


ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

వెంకటాచలం : ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీఓ 117ను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చేవూరు సుబ్బారావు కోరారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవూరి సుబ్బారావు మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే వర్తించేలా చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ఎం.శ్రీధర్, మండల ఉపాధ్యక్షుడు నారాయణ, మండల కార్యదర్శి సురేష్ చంద్రశేఖర్, మండల నాయకులు రవీంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ట


కలశ ప్రతిష్ట నిర్వహిస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాలెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న మహాలక్ష్మీగోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం మహాలక్ష్మికి రక్షాబంధనం, మూలమూర్తికి స్నపన నవకలశ తిరుమంజనం, కలశ ప్రతిష్ట, అష్టోత్తర శతకలశాభిషేకం, తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ద్వారతోరణ, మహాకుంభ, చక్రాబ్జ, మండల ఆరాధన, చతుష్కుండ హోమాలు, పూర్ణాహుతి, మహానివేదన, శాత్తుమొర, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. దేవరాల సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ, గడ్డం రత్నయ్య, సుజాత దంపతులు పాల్గొన్నారు. స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, మోహన్‌రావు, కేజీ శంకరన్, తదితరులు పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య


చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అంగన్‌వాడీలు

నెల్లూరు సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యలో భాగంగా మూడేళ్లు నిండిన చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నట్లు అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ అన్నపూర్ణ తెలిపారు. గాంధీనగర్ సెక్టార్ పరిధిలోని కల్లూరుపల్లి హెచ్‌బీ2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రీస్కూల్ పూర్తి చేసుకున్న ఐదేళ్లు నిండిన చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన చిన్నారులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, డయేరియా నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీలు వసంత కుమారి, విజయమ్మ, తులసి, స్వాతి, ఆయాలు ప్రేమ, విజేత తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం..
విద్యార్థులకు శాపం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్నతంగా, పూర్తిస్థాయి వసతులతో తీర్చిదిద్దిన పాఠశాలలను అధికారులు సమస్యల నిలయంగా మార్చారు. డిజిటల్ బోర్డులు, టీవీలతో పాటు అన్ని వసతులు కలిగిన తరగతి గదులను విద్యాసామగ్రి స్టోర్‌రూమ్‌లుగా మార్చడంతో పాఠశాల వరండాల్లో విద్యాబోధన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పాఠశాలలు పునఃప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ విద్యాసామగ్రి పంపిణీ చేయకుండా తాత్సారం చేయడం, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాల వరండాలో విద్యా బోధన చేస్తున్న టీచర్

- సమస్యల నిలయంగా మనుబోలు పాఠశాల
- స్టోర్‌రూమ్‌లుగా తరగతి గదులు
- వరండాల్లో విద్యాబోధన
- పట్టించుకోని విద్యాశాఖ ఉన్నతాధికారులు

మనుబోలు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను అధికారులు విద్యాసామగ్రి భద్రపరిచే స్టోర్‌రూమ్‌గా మార్చేశారు. దీంతో విద్యార్థులు ఆరుబయట వరండాల్లో విద్యాభాసం చేస్తున్నారు. మండల పరిధిలో 52 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా ఇచ్చే యూనిఫామ్‌లు, పాఠ్య పుస్తకాలు, బూట్లు తదితర విద్యా సామగ్రిని గతంలో మండల వనరుల కేంద్రంలో భద్రపరిచేవారు. ఈ ఏడాది మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో భద్రపరచారు. ఈ పాఠశాల ప్రారంభమై 6 వారాలు దాటినా వాటిని పూర్తిగా పంపిణీ చేయకపోవడంతో తరగతి గదులు స్టోర్‌రూమ్‌లను తలపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు గదుల బయట వరండాలో కూర్చుని విద్యాభ్యాసం చేయాల్సి వస్తోంది. దీంతో పాటు మండలంలోని పాఠశాలలకు విద్యా సామగ్రిని పంపిణీ చేసేందుకు వచ్చిపోయే వాహనాల ధ్వనులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు వానకు విద్యార్థులు ఆరుబయట కూర్చోవాల్సి రావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తరగతి గదుల్లో చిందరవందరగా పడేసిన విద్యాసామగ్రితో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులు, టీవీలు పాడయ్యే ప్రమాదం ఉంది.

ఎన్నో ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ..

మండల కేంద్రంలో ఎన్నో ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని వదిలేసి ఉన్నత పాఠశాల తరగతి గదుల్లో విద్యాసామగ్రిని ఉంచడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలంటే ప్రజల్లో చిన్నచూపు ఉన్న నేపథ్యంలో ఇలాంటి నిర్లక్ష్యం పాఠశాలల మనుగడకు మరింత చేటు చేసే అవకాశం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన జరిగేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.


తరగతి గదిలో చిందరవందరగా పుస్తకాలు


స్టోర్‌రూమ్‌ను తలపిస్తున్న తరగతి గది

పిల్లలను బడికి పంపండి


ముత్తుకూరు : బ్రహ్మదేవిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ముత్తుకూరు : తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తాన్య అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం బ్రహ్మదేవి ప్రధాన వీధుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ, పిల్లలు చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. చదివించడం భారం అని భావించకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

పిల్లలంతా బడిలోనే ఉండాలి


కోవూరు : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోవూరు : బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా సమన్వయకర్త సుబ్రహ్మణ్యం, కోవూరు ఎంఈఓ–2 వై.చెంచులక్ష్మమ్మ తెలిపారు. మండలంలోని స్టౌ బీడీ కాలనీ, చంద్రమౌళి నగర్‌లోని గిరిజన కాలనీలో వారు మంగళవారం ర్యాలీ చేశారు. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలు కచ్చితంగా విద్యాభ్యాసం చేయాలని, ఎక్కడైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్యాన్ని హరించే హక్కు తల్లిదండ్రులకు కూడా లేదని, బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై, ఉపాధ్యాయులపై, అధికారులపై ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి బిడ్డను పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీరఅభయాంజనేయస్వామి, శివాలయం, ప్రభగిరిపట్నంలోని ఆంజనేయస్వామి దేవస్థానాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి సోమిరెడ్డి జ్యోతమ్మ పూజలు చేశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు పొదలకూరు విద్యార్థులు



ప్రతిభ చూపిన చరిత్, నవదీప్

పొదలకూరు : గతేడాది డిసెంబర్ నెలలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో పొదలకూరు మండలం అమ్మవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన ఆర్వీ చరిత్, జి.నవదీప్ ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాటు ఏటా రూ.12 వేల స్కాలర్‌షిప్ అందుతుంది. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం విజయ్ కుమార్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సురేంద్రకుమార్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు


భక్తులకు అన్నదాన కార్యక్రమం


అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రెడ్డిజన సేవా సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించి ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలను జరిపించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ, ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన రెడ్డిజన సేవా సంఘం యువకులు హనుమాన్ చాలీసాను ఆలపించారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో దేవస్థానం ప్రాంగణాన్ని అలంకరించారు. అంజనేయస్వామి, శ్రీసీతారాముల ఎల్‌ఈడీ కటౌట్‌లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాటలు, బాణసంచా, మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలతో అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మహిళాభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న కార్యక్రమాల్లో పట్టణానికి చెందిన ప్రముఖులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన హనుమాన్ భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం


ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా మంగళవారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. ఉభయకర్తలుగా వెంకటసుబ్బారావు–రత్నమ్మ, మోహన్‌కుమార్–అలేఖ్య దంపతులు వ్యవహరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజల్లో దేవస్థానం నిర్వాహకులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ సమావేశం


మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

పొదలకూరు : స్థానిక సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ షేక్ ఖాదర్‌వలీ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ చికిత్స గురించి, డయేరియా వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ల్యాబ్ టెక్నీషియన్లకు పలు సూచనలు చేశారు. సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుకూలమైన పంటలను సాగు చేయాలి

- మండల వ్యాప్తంగా భూసార పరీక్షలు


మట్టి నమూనా సేకరణను పర్యవేక్షిస్తున్న ఏఓ జహీర్

మనుబోలు : భూమి స్వభావానికి అనుకూలమైన పంటలను రైతులు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ అన్నారు. మండలంలోని మనుబోలు, చెర్లోపల్లి, జట్లకొండూరు, కాగితాలపూరు గ్రామాల్లో రైతుల సహకారంతో 44 మట్టి నమూనాలను మంగళవారం సేకరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మనుబోలు మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి 1,139 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సేకరించిన నమూనాలను నెల్లూరులోని భూసార పరీక్షా కేంద్రానికి పంపుతామని తెలిపారు. అక్కడ భూసార పరీక్షలు జరిపి భూమికి సంబంధించి పూర్తి డేటాతో రైతులకు ఒక కార్డు ఇస్తామని తెలియజేశారు. ఆ కార్డులో భూమికి సంబంధించి ఎలాంటి పోషకాలు అధికంగా ఉన్నాయి, ఎలాంటి ఎరువులు వాడాలి. ఏఏ పంటలకు అనుకూలంగా ఉంటుంది, నీటి యాజమాన్యం తదితర వివరాలు పొందుపరుస్తారని పేర్కొన్నారు.

మారెమ్మకు పొంగళ్ల సమర్పణ


ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెడుతున్న మహిళలు


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

తోటపల్లిగూడూరు : మండలంలోని చిన్నచెరుకూరు గ్రామదేవత మారెమ్మ అమ్మవారికి పొంగళ్ల సమర్పణ కార్యక్రమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెల 28వ తేదీన తొలి సద్ది కార్యక్రమంతో ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాల చివరి ఘట్టం మంగళవారం పొంగళ్ల సమర్పణతో ముగిశాయి. ఈ క్రమంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లను పొంగించి అమ్మవారికి సమర్పించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముమ్మరంగా వేరుశనగ సాగు


పంటపాళెం వద్ద శనగ పంటలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

ముత్తుకూరు : మండలంలో రెండో పంట కింద ముమ్మరంగా వేరుశనగ సాగు జరుగుతున్నట్లు మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి మంగళవారం తెలిపారు. ఫిల్టర్ పాయింట్ల ద్వారా, దొరువుల నీటి ద్వారా సుమారు 110 ఎకరాల్లో శనగ సాగు జరుగుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా పంటపాళెం, నారికేళపల్లి పంచాయతీల్లో దొరువుల కింద సాగు చేస్తున్నారన్నారు. ముత్తుకూరు, మామిడిపూడి, పిడతాపోలూరు పంచాయతీల పరిధిలో ఫిల్టర్ పాయింట్ల కింద శనగ సాగు జరుగుతోందని పేర్కొన్నారు. వాతావరణ అనుకూలతను బట్టి జూలై వరకు సాగు చేస్తారని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో పంట కలుపు తీసే దశకు చేరిందన్నారు.

పరిశుభ్రమైన ఆహారంతో డయేరియా దూరం


కొడవలూరు : రామన్నపాళెంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


పొదలకూరులో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

కొడవలూరు : పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం ద్వారా డయేరియాను దూరం చేయవచ్చని హెల్త్ అసిస్టెంట్ వెంకట్రావు సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో డయేరియాపై మంగళవారం ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న, ఈగలు ముసిరిన, పాచిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల డయేరియాకు గురవుతారన్నారు. స్వచ్ఛమైన, తాజాగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఈగల ఆవాసాలుగా ఉండే మురికి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటి వద్ద మురికి నీటి నిల్వలు, చెత్తా చెదారాలు లేకుండా నివారించుకోవాలన్నారు. వీటిపై ఉన్న ఈగలు ఇంట్లోని ఆహార పదార్థాలపై వాలే ప్రమాదం ఉన్నందున ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

పొదలకూరు : స్థానిక ఎమ్మార్వో కాలనీలో డయేరియా(వాంతులు, విరేచనాలు)పై ఆరోగ్యశాఖ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని సేవించాలని, వేడి చల్లారకముందే భోజనం చేయాలని తెలిపారు. వాంతులు, విరేచనాలు ఉన్నవారు వెంటనే సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాధాకుమారి, శివప్రసాద్, సుమాంజలి, ఆశా కార్యకర్తలు సీత, లక్ష్మి పాల్గొన్నారు.